1. [1]అలపిశాచముతోడను - దేవుఁడు తొల్లిఁ - బలుకు వాక్యము జాడను = [2]పొలతి సంతతి నిన్ను - తలఁగొట్టఁ బుట్టునని - తెలియఁజేసెను మోషె - దీర్ఘ దర్శన వాక్య ॥మిదిగో॥

2. ఘన దివ్య బలిచేయను - పాపములెల్లఁ - [3]దునిమి పుణ్యము లియ్యను = [4]ఒనరఁగ నీ కాల మునఁ గ్రీస్తు వచ్చునని - మును దానియేలు బ - ల్కెను దీర్ఘ దర్శనము ॥ఇదిగో॥

3. యూద రాజ్యములోపట - బెత్లేమనెడి - యూరఁ గ్రీస్తుడు బుట్టుట = ఆదిలోన మీకా - యను దీర్ఘ దర్శిచే - మోదమునఁ దెల్పబడె - ముందు వేదమునందు ॥ఇదిగో॥

4. మన దోషముల కొఱకునై - యేసుని కాయ - మది గాయముల [5]హ్రస్వమై = మన రక్షకుని పాట్లు - గనినట్టుల యెషయ్య - మును దెల్పె దీర్ఘద - ర్శన వాక్యముల నిచ్చి ॥ఇదిగో॥

- పురుషోత్తమ చౌధరి

# క్రీస్తు కృపా ప్రేమలు

## 161 యేసు ప్రేమను స్తుతించుట

రా - బిలహరి తా - అట

వింతగల మా యేసు ప్రేనుమ - సంతసమున స్తుతింతును = పంతముగఁ దన ప్రాణమును పా - పులకు నియ్యను వచ్చి సిలువను - జచ్చి నను రక్షించె నహహా ॥వింత॥

1. ప్రీతిగల మా ప్రభుని కృప బహు - ప్రియముతోఁ జాటింతును = సాధుగా నాకొఱకు సిలువను - చాల శ్రమల భరించి చావు జ - యించి నను రక్షించె నహహా ॥వింత॥

[1]ఆ. [2]స్త్రీ. [3]నాశనముచేసి [4]చక్కగా. [5]క్షీణించి.



2. పాడుఁడీ మా యేసు ప్రేమను - వేఁడుఁడీ మదిఁ గూడుఁడీ = పాడుఁడీ తన దివ్యరక్తము - పాప క్రయముగ నిచ్చి శాపముఁ - బాపి నను రక్షించె నహహా ॥వింత॥

3. నిత్య జీవము నిండు నెమ్మది - నిరతముగ నాకియ్యను = రక్తస్వేదము గార్చె నహహా - నరక శాపముఁ ద్రుంచి యాపద - నుంచి నను రక్షించె నహహా ॥వింత॥

- తూపిలి బెంజిమిన్

## 162 యేసే రక్షకుఁడు

రా - శంకరాభరణము తా - రూపకము

అన్నా మన యేసు ప్రభుని - కన్న రక్షకుఁడు లేఁడు = ఎన్న రాని మన యఘము - లన్ని సడలించి ప్రోచు ॥నన్న॥

1. మన దోషములకు బదులుగ - మరణావస్థల నొందెను = తన దివ్యావయవముల ర - క్తము చిందించెను భువిపై ॥నన్న॥

2. నిజ రక్షకుఁడితఁడే మన వృజినాదులఁ బరిమార్చను = విజయం బగు నతని పాద - రజయుగ్మమును స్మరించు ॥మన్న॥

3. దిక్కు మాలిన వారికి - దిక్కై మార్గముఁజూపెను = చక్కనీ గుణముల సొం - పెక్కి వర్తించె నహహ ॥యన్న॥

4. ఈలాటి దయాసముద్రు - నిల నెందైనను గానము = నీలోఁ గల దుర్గుణాది - జాలంబులఁ గడఁ ద్రోయును ॥అన్న॥

5. మృతి గెల్చిన వాఁడే దు - రిత జీవులఁ బ్రోవఁ దగును = మృతి నొంది నశించు లోక - మూఢాత్ముల కేలఁ గల్గు ॥నన్న॥

- రావూరి లక్ష్మయ్య

## 163 యేసు గొఱ్ఱెల మంచి కాపరి

రా - పంతువరాళి తా - చాపు

ఇదుగో గొఱ్ఱెలకాపరి - సోదరులారా - యిదుగో గొఱ్ఱెలకాపరి = కడగానరాని - కారడవిలో నలసటఁ - పడెడు గొఱ్ఱెలను - పేరిడిబిల్చి రక్షించు ॥నిదుగో॥